ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 20 సంచిక : 268 మంగళవారం 23, జూన్ 2026 పేజీలు: 4 వెల: రూ.1

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR CELL : 8008609999

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

**నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష**
**తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్**
**జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా మిగతా 2లో..

# మత్తు వదలండి.. మైదానాలు చేరండి

**యువతకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు..**
**మహబూబ్‌నగర్‌లో రూ. 12.53 కోట్లతో క్రీడా పనులకు శంకుస్థాపన**
**పాలమూరు క్రీడాభివృద్ధికి వంద కోట్లయినా ఖర్చు చేస్తామన్న మంత్రి**
**క్రీడల బడ్జెట్‌ను రూ. 640 కోట్లకు పెంచిన సీఎం రేవంత్ రెడ్డి**
**350 మంది కొత్త కోచ్‌ల నియామకం.. సీఎం కప్‌తో ప్రతిభకు గుర్తింపు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
"యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. స్మార్ట్‌ఫోన్లు, వ్యసనాల మత్తును వదిలి మైదానాల్లోకి అడుగుపెట్టాలి" అని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం మైదానంలో మిగతా 2లో..

# నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు.. వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా

**ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్**
**మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ**
**సప్తసముద్రాలు దాటినా వెతికి పట్టుకొస్తానని శపథం**
**వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడుకి, ఆయన బృందానికి సినిమా చూపిస్తానన్న కేటీఆర్**
**వర్ధన్నపేట కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను మిగతా 2లో..

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రక్షణ శాఖ మద్దతు.

**మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక హామీ**
**రాజ్‌నాథ్‌తో ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**
**గాంధీ సరోవర్ ప్రాజెక్టు భూముల బదిలీపై కృతజ్ఞతలు**
**ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం**
**దేశ భద్రతకు అత్యంత కీలకమైన ప్రాజెక్ట్**
**విమానాశ్రయంలో కార్గో, ఎంఆర్‌వో వసతుల ఏర్పాటు**
**అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ హ్యాంగర్స్ ఏర్పాటు**
**దేవరకద్ర డీఆర్డీవోకు తక్షణ అనుమతులు ఇవ్వాలి**
**సానుకూలంగా స్పందించిన కేంద్ర రక్షణ మంత్రి**
**సమావేశంలో పాల్గొన్న ఇరు శాఖల ఉన్నతాధికారులు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రాష్ట్రంలో రవాణా, పారిశ్రామిక రంగాల వృద్ధికి ఊతమిచ్చేలా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దిల్లీ వేదికగా కీలక అడుగులు వేశారు. దేశ రాజధానిలోని రక్షణ శాఖ కార్యాలయం 'కర్తవ్య భవన్' లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో భారత వాయుసేన ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని రకాల అత్యాధునిక వసతులతో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. సరిహద్దు రక్షణతో పాటు పౌర విమానయానానికి అనుకూలంగా ఈ విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలని కోరారు.

ఈ సమావేశం ప్రారంభంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు' నిర్మాణానికి అడ్డుగా ఉన్న రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించి, భూములను కేటాయించినందుకు గాను రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఇలాంటి సానుకూల సహకారం భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఒకటని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ విమానాశ్రయ విస్తరణ, అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తుందన్నారు. అలాగే విమానాశ్రయ పరిధిలోకి వచ్చే విద్యుత్, నీటి సరఫరా వంటి యుటిలిటీస్ బదిలీ అంశాలలో కేంద్ర రక్షణ శాఖకు, భారత వాయుసేనకు తెలంగాణ ప్రభుత్వం తరపున వంద శాతం పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మంత్రికి భరోసా ఇచ్చారు.

ఆదిలాబాద్‌లో రాబోయే ఎయిర్‌పోర్ట్ కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాదని, ఇది దేశ సమగ్రతకు, సరిహద్దు రక్షణకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భారత వాయుసేన తన వ్యూహాత్మక అవసరాల కోసం ఈ విమానాశ్రయాన్ని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో, రక్షణ శాఖ తీసుకునే ప్రతి నిర్ణయానికి రాష్ట్ర యంత్రాంగం మిగతా 2లో..

# ఢిల్లీలో ఒక నీతి.. హైదరాబాద్‌లో ఒక రీతా?

**విదేశీ విధానాల్లో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాలను పాటిస్తోందన్న శ్రవణ్**
**ట్రంప్ ను ప్రసన్నం చేసుకోవడానికి మోదీ దేశ గౌరవాన్ని తాకట్టు పెట్టారని కాంగ్రెస్ నేత అన్నారని వ్యాఖ్య**
**తెలంగాణలో ట్రంప్ టవర్స్ కు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని విమర్శ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్ పార్టీ విదేశీ విధానాల్లో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శిస్తూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ లేఖ రాశారు. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ చెప్పే జాతీయ, మిగతా 2లో..



# ప్రజా పాలన అంటే సినిమా అనుకుంటున్నారా?

**కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క ఘాటు కౌంటర్**
**ప్రజా పాలనను సినిమాలతో పోల్చడం సరికాదు**
**బీఆర్ఎస్ పార్టీ అబద్ధాల పుట్టగా మారింది**
**కేటీఆర్ అజెండా ప్రకారం పాలన సాగదు**
**మాది పేదలు, రైతుల పక్షపాతి ప్రభుత్వం**
**రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే**
**నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచన**






**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై గులాబీ పార్టీ (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు చేసిన విమర్శలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పాలనను "సగం సినిమా అట్టర్ ఫ్లాప్ అయింది, మిగిలిన సగం మాత్రమే ఉంది" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని మంత్రి సీతక్క రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. ప్రజల కోసం సాగుతున్న ప్రజా పాలనను సినిమాతో పోల్చడం కేటీఆర్ అపరిపక్వ ఆలోచనా విధానానికి, అహంకారానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు. రాత్రింబవళ్లు ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం కష్టపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సినిమాల కోణంలో చూడటం కేటీఆర్ దిగజారుడు రాజకీయ సంస్కృతికి నిదర్శనమని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రభుత్వం అంటే ఏదో మూడు గంటల సినిమా కాదని, కోట్ల మంది ప్రజల జీవితాలతో మిగతా 2లో..

# కోర్టుకు అల్లు అర్జున్ డుమ్మా!

**షూటింగ్ సాకుతో పిటిషన్..**
**విచారణ జూలై 6కు వాయిదా**
**సంధ్య థియేటర్ కేసు విచారణ**
**ఇతర 18మంది నిందితుల హాజరు..**
**బాండ్లపై సంతకాలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
టాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు, 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి కోర్టు విచారణకు హాజరుకాలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద గతంలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో ఆయన ఈరోజు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది. ఈ మేరకు గతంలోనే న్యాయస్థానం సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నందున భౌతికంగా హాజరుకావడం సాధ్యం కాదంటూ అల్లు అర్జున్ తన న్యాయవాది ద్వారా కోర్టుకు సమాచారం అందించారు. వ్యక్తిగత హాజరు మిగతా 2లో..

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా

**ఓట్ల దొంగతనంతో పాటు బీజేపీ సీట్ల దొంగతనానికీ పాల్పడుతోందని ఆరోపణ**
**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ**
**సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని వెల్లడి**

02



# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

మొదటిపేజీ తరువాయి

సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు.. వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా

మొదటిపేజీ తరువాయి

కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా విడిచిపెట్టను" అని అన్నారు.

కార్యకర్తలను వేధించిన వారు ఎక్కడున్నా వదలబోమని కేటీఆర్ హెచ్చరించారు. "రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది. వదిలిపెట్టే సమస్యే లేదు. ఇది ఊరికే చెప్పడం లేదు, గుర్తు పెట్టుకోండి" అని ఆయన వ్యాఖ్యానించారు.



# కోర్టుకు అల్లు అర్జున్ డుమ్మా!

మొదటిపేజీ తరువాయి

నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ ప్రాంగణంలో జరిగిన ప్రమాదంపై నమోదైన కేసులో తీవ్రత దృష్ట్యా ఈ నెల 22న అల్లు అర్జున్ ఖచ్చితంగా కోర్టుకు రావాలని నాంపల్లి న్యాయస్థానం గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే, కోర్టు గడువు ముగిసే సమయానికి కూడా నటుడు అక్కడ ప్రత్యక్షం కాలేదు. షూటింగ్ బిజీ షెడ్యూల్ కారణంగానే ఆయన రాలేకపోయారని తెలుస్తోంది. కోర్టుకు రాకపోవడంపై సర్వత్రా ఆసక్తికర చర్చ నడుస్తోంది.

ఈ కేసుకు సంబంధించి కోర్టు మొత్తం 19 మంది నిందితులకు సమన్లు జారీ చేసింది. జూన్ 22న అందరూ న్యాయమూర్తి ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం.. అల్లు అర్జున్ మినహా మిగిలిన 18 మంది నిందితులు సోమవారం ఉదయమే నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. వీరంతా న్యాయమూర్తి సమక్షంలో విచారణకు హాజరై, తమకు కేటాయించిన వ్యక్తిగత షూరిటీ బాండ్లపై సంతకాలు పూర్తి చేశారు.

ప్రస్తుతం అల్లు అర్జున్ బాలీవుడ్ పరిధిలోని ముంబై నగరంలో ఒక ముఖ్యమైన సినిమా షూటింగ్‌లో ఉన్నట్లు ఆయన లీగల్ టీమ్ ప్రకటించింది. ముంబై షెడ్యూల్ ఎంతో కీలకమైనది కావడం వల్లే ఆయన హైదరాబాద్ వచ్చి విచారణకు భౌతికంగా హాజరుకాలేకపోతున్నారని జాతీయ వార్తా సంస్థ 'ఏఎన్ఐ' ప్రతినిధులకు ఆయన న్యాయవాదులు ముందుగా తెలియజేశారు.

కోర్టుకు స్వయంగా రాలేని పక్షంలో.. అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్ పద్ధతి) ద్వారా నాంపల్లి కోర్టు విచారణలో పాల్గొంటారని మొదట ఆయన లీగల్ టీమ్ ప్రచారం చేసింది. ముంబై షూటింగ్ స్పాట్ నుంచే ఆయన ఆన్‌లైన్ ద్వారా హాజరవుతారని భావించారు. అయితే, సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల ఆయన వర్చువల్‌గా కూడా విచారణకు హాజరుకాలేదు. దీంతో చేసేదేం లేక అల్లు అర్జున్ తరఫు న్యాయవాది కోర్టులో అధికారికంగా 'ఆబ్సెంట్ పిటిషన్' దాఖలు చేయాల్సి వచ్చింది.

నిందితుడి స్థానంలో ఉన్న అల్లు అర్జున్ అటు భౌతికంగా, ఇటు వర్చువల్‌గా కూడా కోర్టు విచారణకు రాకపోవడంపై న్యాయస్థానం స్పందించింది. ఆయన వ్యక్తిగతంగా హాజరుకానందున, అందుకు గల సరైన కారణాలను వివరిస్తూ తక్షణమే ఒక సమగ్రమైన



'మెమో' దాఖలు చేయాలని అల్లు అర్జున్ న్యాయవాదులకు కోర్టు గట్టిగా సూచించింది. చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసింది.

రెండు వైపులా వాదనలు విన్న అనంతరం నాంపల్లి న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల జూలై 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, వచ్చే విచారణ సమయానికైనా అల్లు అర్జున్ అందుబాటులోకి వస్తారా అన్న ప్రశ్నకు ఆయన లాయర్ సమాధానమిచ్చారు. జూలై 6న జరిగే తదుపరి విచారణకు అల్లు అర్జున్ ఖచ్చితంగా వర్చువల్ పద్ధతిలో న్యాయస్థానం ముందు హాజరవుతారని న్యాయమూర్తికి హామీ ఇచ్చారు.

అసలు ఈ వివాదం 2024 డిసెంబర్ నెలలో ప్రారంభమైంది. అప్పట్లో మోస్ట్ అవేటెడ్ మూవీ 'పుష్ప 2: ది రూల్' సినిమా ఘనంగా విడుదలవుతున్న సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ ఆవరణలో భారీ ప్రీమియర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హీరో అల్లు అర్జున్ వస్తున్నారనే సమాచారంతో వేలాది మంది అభిమానులు ఒక్కసారిగా థియేటర్ ముట్టడించారు. ఈ క్రమంలో జరిగిన ఘోర తొక్కిసలాటలో రేవతి అనే ఒక వివాహిత ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పలువురు అభిమానులు కూడా క్షతగాత్రులయ్యారు.

ఈ ప్రమాదంపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో సంధ్య థియేటర్ యాజమాన్యం మరియు నిర్వాహకులను ఏ1 నుంచి ఏ10 నిందితులుగా చేర్చారు. తొక్కిసలాట జరగడానికి నటుడి రాక, భద్రతా లోపాలే కారణమంటూ అల్లు అర్జున్‌ను ఈ కేసులో ఏ11 నిందితుడిగా పోలీసులు చేర్చడం అప్పట్లో టాలీవుడ్‌లో పెను సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గతంలో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయగా, ఆయన ఒక రాత్రి మొత్తం జైలు గదిలో గడపాల్సి వచ్చింది. ఆ మరుసటి రోజు ఉదయమే ఆయనకు కోర్టు నుంచి బెయిల్ లభించింది.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రక్షణ శాఖ మద్దతు.

మొదటిపేజీ తరువాయి

అండగా ఉంటుందన్నారు. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే ఏ కార్యక్రమానికైనా తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ మొదటి వరుసలో ఉంటుందని రక్షణ మంత్రికి వివరించారు.

భారత వాయుసేన రక్షణ అవసరాల కోసం నిర్మించే ప్రత్యేక టెర్మినల్‌తో పాటు, సాధారణ ప్రయాణికుల సౌకర్యార్థం పౌర విమానయాన శాఖ (సివిల్ ఏవియేషన్) ఆధ్వర్యంలో ఒక ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్‌ను కూడా ఇక్కడ నిర్మించాలని సీఎం కోరారు. దీనితో పాటు భారీ ఎత్తున వస్తు రవాణాకు అనుకూలంగా ఉండే 'కార్గో' సేవలను, విమానాల మరమ్మతుల కోసం 'ఎంఆర్‌వో' వసతులను మరియు అధునాతన హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఇటీవల మధ్య ఆసియా దేశాలలో చోటుచేసుకుంటున్న భౌగోళిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు తమ విమానాల భద్రత, నిర్వహణ కొరకు సురక్షితమైన ప్రదేశాలలో కొత్త హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. భౌగోళికంగా మరియు వాతావరణ పరంగా అంతర్జాతీయ హ్యాంగర్ల ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన ప్రదేశమని.. కాబట్టి కేంద్ర రక్షణ శాఖ ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని కోరారు.

రక్షణ రంగ పరిశోధన సంస్థలైన డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్ తమ అత్యంత కీలకమైన సరికొత్త ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర సమీప ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి లభిస్తుందని వివరించారు. కాబట్టి ఈ డీఆర్డీవో ప్రాజెక్టుకు రక్షణ శాఖ తరఫున త్వరితగతిన తుది అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభ్యర్థనలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎంతో సానుకూలంగా స్పందించారు. తెలంగాణ అభివృద్ధికి, దేశ భద్రతకు ముడిపడి ఉన్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విస్తరణ పనులను తాము వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. పౌర విమానయాన రంగానికి, కార్గో సేవల విస్తరణకు అవసరమైన సాంకేతిక నివేదికలను సిద్ధం చేయాల్సిందిగా తన శాఖ అధికారులను ఆదేశిస్తామన్నారు. అలాగే దేవరకద్ర డీఆర్డీవో ప్రాజెక్టు అనుమతుల ఫైలును కూడా త్వరలోనే పరిశీలిస్తామని సీఎంకు స్పష్టం చేశారు.

దేశ రాజధానిలో జరిగిన ఈ అత్యంత ప్రాధాన్యత కలిగిన దౌత్య సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్. శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్‌లు హాజరై ప్రాజెక్టులకు సంబంధించిన మ్యాపులు, సాంకేతిక వివరాలను కేంద్ర రక్షణ శాఖ అధికారులకు వివరించారు.

# ప్రజా పాలన అంటే సినిమా అనుకుంటున్నారా?

మొదటిపేజీ తరువాయి

ముడిపడి ఉన్న బాధ్యత అని గుర్తు చేశారు. కల్పిత కథలతో నడిచే సినిమాలకు, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వానికి ఉన్న తేడాను కేటీఆర్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఇటువంటి చౌకబారు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

గడిచిన కొన్ని నెలలుగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అబద్ధాల పుట్టగా మారిపోయిందని మంత్రి సీతక్క ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి మంచి సూచనలు చేయాల్సిన ప్రధాన ప్రతిపక్షం.. ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కేవలం నిరంతర విమర్శలు చేయడం, సోషల్ మీడియా వేదికగా రాజకీయ డ్రామాలకు తెరతీయడానికే పరిమితం అవుతోందని ధ్వజమెత్తారు. వాస్తవాలను పక్కనపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించడమే ధ్యేయంగా గులాబీ నేతలు పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల గొంతుకను వినిపించాల్సిన బాధ్యత ప్రతిపక్షానిదే అయినప్పటికీ, తెలంగాణలో ఆ పరిస్థితి లేదని సీతక్క వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న ఫలాలను చూసి ఓర్వలేక, ఏదో ఒక రకంగా గందరగోళం సృష్టించాలని చూస్తున్నారన్నారు. నిజమైన సమస్యలను ప్రస్తావించి, వాటికి పరిష్కార మార్గాలు సూచిస్తే ప్రభుత్వం ఖచ్చితంగా స్వీకరిస్తుందని, కానీ బీఆర్ఎస్ నేతలు కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే అసత్య ప్రచారాలు ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు.

“కేటీఆర్ అనుకున్న ఆలోచనలు, వారి పార్టీ అజెండాలు మా ప్రభుత్వంలో అమలు కాకపోతే.. మా పాలన విఫలమైనట్లా?” అని మంత్రి సీతక్క నిలదీశారు. తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, ఇది కేవలం ప్రజల అవసరాలు, రాష్ట్ర ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఎవరిదో వ్యక్తిగత లేదా ఒక కుటుంబ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రభుత్వం నడవదని తేల్చి చెప్పారు. అబద్ధాలను పదే పదే ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ నాయకులు దిట్టలుగా మారారని విమర్శించారు.

ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా పేదలు, రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. దేశంలోనే రైతు సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధి విషయాల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక ప్రత్యేకమైన చరిత్ర, విశ్వసనీయత ఉన్నాయని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు పడిన కష్టాలను తీరుస్తూ, వారి ముఖాల్లో ఆనందం చూడటమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

భారతదేశంలోనే రైతులను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించేందుకు భారీ ఎత్తున రుణమాఫీ చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని సీతక్క అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి (వైఎస్సార్) ప్రభుత్వంలో ఏకకాలంలో రైతు రుణమాఫీని విజయవంతంగా అమలు చేసి చూపించామని గుర్తు చేశారు. అదే రీతిలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీని పక్కాగా అమలు చేసి అన్నదాతలకు అండగా నిలిచిందని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చడానికి మరియు బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలు చేపడుతోందని సీతక్క వెల్లడించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ మరియు గిట్టుబాటు ధర ఉన్న పంటలను సాగు చేసేలా రైతులను శాస్త్రీయంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల రైతులకు దళారీల భయం లేకుండా మంచి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను మార్చడమే తమ లక్ష్యమన్నారు.

ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం తమ పంథాను మార్చుకుని, ప్రజల సమస్యలపై నిజాయితీతో కూడిన నివేదికలతో రాణించాలని, సమాజానికి ఉపయోగపడేలా ఒక నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సీతక్క సూచించారు. నిరంతరం విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఉపయోగపడే మంచి సలహాలు ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ప్రతి విమర్శను ప్రజలు గమనిస్తున్నారని, తాము చేపడుతున్న సంక్షేమ, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలే తమ ప్రభుత్వ తిరుగులేని పనితీరుకు నిదర్శనమని సీతక్క స్పష్టం చేశారు.

# మత్తు వదలండి.. మైదానాలు చేరండి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో రూ. 12.53 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు కట్టుబడి ఉందన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం భారీ నిధులను కేటాయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ రూ. 12.53 కోట్ల నిధులతో ఇండోర్ స్టేడియం మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూ. 10.70 కోట్లతో 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మించనున్నారు. దీనితో పాటు రూ. 1 కోటి వ్యయంతో నాలుగు ఓపెన్ జిమ్‌లు, రూ. 51 లక్షలతో ఇండోర్ జిమ్ మరియు మహిళల అథ్లెటిక్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు. మిగిలిన రూ. 32 లక్షలను ఇతర అనుబంధ క్రీడా వసతుల కోసం ఖర్చు చేయనున్నట్లు మంత్రి వివరించారు.

క్రీడలు అనేవి కేవలం టైమ్‌పాస్ వినోదం మాత్రమే కాదని, మనిషి జీవనశైలిని, క్రమశిక్షణను మార్చే ఒక శక్తివంతమైన సాధనమని మంత్రి శ్రీహరి పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో క్రీడా మౌలిక సదుపాయాల కోసం ఇప్పటికే ప్రభుత్వం సుమారు రూ. 80 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం అవసరమైతే పాలమూరు జిల్లాలో క్రీడల కోసం రూ. 100 కోట్లయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం వెనుకడబోదని మంత్రి స్పష్టం చేశారు.

క్రీడా రంగ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం 'గ్రీన్ ఛానల్' పద్ధతిని తీసుకువచ్చిందని, దీని ద్వారా నిధుల విడుదల, సాంకేతిక అనుమతులు త్వరితగతిన లభిస్తాయని మంత్రి వెల్లడించారు. జిల్లాలోని స్విమ్మింగ్ పూల్‌ను ఇకపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్లబ్‌లు, క్రీడా అసోసియేషన్లు కేవలం నగరాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో దాగి ఉన్న అసలైన ప్రతిభను వెలికితీయడానికి చురుగ్గా పని చేయాలని సూచించారు.

ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి వాకిటి శ్రీహరి క్రీడాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకంతో మహబూబ్‌నగర్ జిల్లాకే నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. జిల్లాలో త్వరలోనే వాలీబాల్, కబడ్డీ అకాడమీలతో పాటు అత్యాధునిక క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడల్లో మన దేశం తరఫున పాలమూరు బిడ్డలు ప్రాతినిధ్యం వహించి దేశానికి బంగారు పతకం సాధించేలా అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తామని, అవసరమైతే ఇందుకోసం మరిన్ని భూములను సేకరిస్తామని స్పష్టం చేశారు. మొదట ఈ బడ్జెట్‌ను రూ. 350 కోట్లకు, ఆ తర్వాత రూ. 640 కోట్లకు పెంచినట్లు వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడా పాఠశాల (స్పోర్ట్స్ స్కూల్) ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. దీనికోసం ఇప్పటికే 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సిద్ధంగా ఉంచినట్లు జితేందర్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 2014 నుంచి 2024 వరకు గత పదేళ్ల కాలంలో క్రీడలకు కేటాయించిన బడ్జెట్ ఎప్పుడూ రూ. 300 కోట్లు దాటలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌లోనే రూ. 360 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ. 468 కోట్లు, తాజా మూడో బడ్జెట్‌లో ఏకంగా రూ. 640 కోట్లు కేటాయించి క్రీడా రంగానికి కొత్త ఊపిరి పోసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో నిర్లక్ష్యానికి గురైన స్టేడియాలు, స్విమ్మింగ్ పూల్స్‌ను పునరుద్ధరిస్తున్నామని, ఉమ్మడి పాలమూరులోని ప్రతి జిల్లాకు రూ. 15 నుండి రూ. 18 కోట్ల వరకు క్రీడా అభివృద్ధి కోసం ఇస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో 2009 తర్వాత క్రీడా కోచ్‌ల నియామకాలే జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులకు నిపుణులైన శిక్షకులను అందుబాటులోకి తెచ్చేందుకు దాదాపు 350 మంది కొత్త కోచ్‌ల నియామక ప్రక్రియను చేపట్టిందని శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'సీఎం కప్' పోటీలను నిర్వహిస్తున్నామని, మొదటి విడతలో 3.5 లక్షల మంది, రెండో విడతలో 5.5 లక్షల మంది పాల్గొనగా.. రాబోయే మూడో ఎడిషన్‌లో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎంపికైన పేద క్రీడాకారుల వసతి, ప్రయాణ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.

# ఢిల్లీలో ఒక నీతి.. హైదరాబాద్‌లో ఒక రీతా?

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ సిద్ధాంతాలకు.. హైదరాబాద్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ‘రోడ్డు నాటకాలకు’ అస్సలు పొంతన లేదంటూ ధ్వజమెత్తారు.

"గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారూ.. నేను ఈ లేఖను మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి రాయడం లేదు. జాతీయ స్థాయిలో ఏఐసీసీ చెబుతున్న సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధంగా తెలంగాణలో మీ సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న ప్రైవేట్ ఫ్రాంచైజీ రాజకీయాలను బట్టబయలు చేయడానికే రాస్తున్నా" అని లేఖలో శ్రవణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒకే విధమైన నిర్దిష్ట సిద్ధాంతం ఉందా, లేక రాష్ట్రాల్లో అవకాశవాదం కోసం విలువలను తాకట్టు పెడతారా అని నిలదీశారు.

జూన్ 20న కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి పవన్ ఖేరా విడుదల చేసిన అధికారిక ప్రకటనను శ్రవణ్ ఈ లేఖకు జతచేశారు. ఆ ప్రకటన ప్రకారం... గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం 'ఇండియా ఫస్ట్' కాకుండా 'పీఆర్ ఫస్ట్' (ప్రచారం కోసం)లా సాగిందని కాంగ్రెస్ ఆరోపించిందని శ్రవణ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడం కోసం మన సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టారని, ట్రంప్ భారత్‌ను చిన్నచూపు చూస్తూ ‘ఆదేశాల భాషలో’ మాట్లాడుతున్నారని, ఆయన ముందు మోదీ మోకరిల్లడం 140 కోట్ల మంది భారతీయులకు సిగ్గుచేటని ఢిల్లీలో కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించిందని చెప్పారు.

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ట్రంప్‌ను అంతలా విమర్శించిన కేవలం మూడు రోజులకే.. అంటే జూన్ 23న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే డొనాల్డ్ ట్రంప్ కోసం హైదరాబాద్‌లో రెడ్ కార్పెట్ పరుస్తున్నారని శ్రవణ్ విమర్శించారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో, యూఎస్ కాన్సులేట్ పక్కనే... కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఏకంగా 'డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ'ను అధికారికంగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోందని అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా ఈ రాజకీయ ద్వంద్వ నీతిని మీరు ఎలా సమర్థిస్తారంటూ రాహుల్ గాంధీని శ్రవణ్ సూటిగా ప్రశ్నించారు.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా

- **ఓట్ల దొంగతనంతో పాటు బీజేపీ సీట్ల దొంగతనానికీ పాల్పడుతోందని ఆరోపణ**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ**
- **సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని వెల్లడి**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి



కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
23-06-2026
మంగళవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# మీ హయంలో కార్యాలయాల తరలింపు....

- మా హయంలో మెదక్ నియోజక వర్గంలో వెయ్యి కోట్ల అభివృద్ధి...
- ఆపదలో ఆదుకొనే మనస్తత్వం మైనంపల్లి ది....
- అభివృద్ధి పై చర్చ నేను సిద్ధం.....
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్....

మెదక్ జూన్ 22 (ప్రజా స్వరం)

నియోజకవర్గం లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మండిపడ్డారు. సోమవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజక వర్గంలో రెండేళ్లలో 1000 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామని, అభివృద్ధి చూసి ఓర్వలేక స్థానిక ఎమ్మెల్యే పైన సోషల్ మీడియాలో వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. మెదక్ నియోజకవరంలో ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని అవాస్తవమని, జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, అంత మొత్తంలో రావడంతో కొనుగోలు సమస్య తలెత్తడం వల్ల ఆలస్యం అయిందన్నారు. గతంలో రైతుల సమస్య కోసం కాంగ్రెస్ పార్టీయే ముందుగా ధర్నా చేసిందని అన్నారు. ఇప్పటి వరకు జిల్లా లో 90 శాతం మంది రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసినట్టు చేసిందన్నారు. రెండేళ్లలో మేము నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి కి సంబంధించిన వివరాలతో మీకు పంపిస్తాం కావాలనే చూసుకోమని అన్నారు. గతంలో మెదక్ నియోజకవర్గం మీరు చేసినట్లు ఇసుక అమ్మకోలేదని, మెదక్ లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోలేదన్నారు. మీరు కార్యాలయాలను తరలిస్తున్న మౌనగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. గత సంవత్సరంలో భారీ వర్షాల వల్ల నియోజకవర్గం లో ప్రాణాలకు తెగించి వరదల్లో చిక్కుకున్న వారిని



భరోసా ఇస్తూ కాపాడడం జరిగిందన్నారు. వరదల్లో నష్టపోయిన ప్రాంతాలను చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి రివ్యూ చేసిన విషయం బీ అర్ ఎస్ నేతలు మరచిపోయినట్లు ఉన్నారని గుర్తు చేశారు. మైనంపల్లి అంటే ఒక బ్రాండ్ అని వారి గురించి మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని అన్నారు. ఇప్పటికీ బి ఆర్ ఎస్ నాయకులు సైతం ఆయన సహాయం కోసం నివాసానికి వస్తారని ఎలాంటి వ్యక్తులకు అయినా సహాయం చేస్తే మనస్తత్వం ఆయనది అన్నారు. మేము చేసిన అభివృద్ధి చూపిస్తాం మీరు చేసిందేంటో చెప్పాలని దీనిపై చర్చ కు ఎక్కడికైనా సిద్ధమని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్స్ గంట సంపత్, రాజశేఖర్, నర్సింలు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు హఫీజ్, నాగరాజు, రమేష్, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్, తాహెర్, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన మెదక్.....



- వివిధ కళారూపాల్లో భారీ బోనాల ఊరేగింపు.....
- పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి.....

మెదక్ జూన్ 22 (ప్రజా స్వరం)

అమ్మా బెల్లెల్లినాదో.. నాయనా.. తల్లీ బెల్లెల్లినాదో.. అంటూ జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీ మాత నల్ల పోచమ్మ 20 వ బోనాల వార్షికోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భిన్న సంస్కృతులతో అలరారుతూ.. నిర్వహించిన బోనాల పండుగ సంబరం అంబరాన్నం టాయి. దాంతో మెదక్ కొత్త శోభ సంతరించుకుంది. డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఊరేగింపులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని నవా పేట, పెద్దబజార్, న్యూమార్కెట్, పిట్లంబేస్, బార హిమామ్, ఫతే నగర్, గాంధీనగర్, దాయర, హౌసింగ్ బోర్డు, ఇందిరా కాలనీ, మిలిటరీ కాలనీ, సుభాష్ నగర్ కాలనీ, జమ్మికుంట, అజంపుర, సాయినగర్, వెంకట్రావు నగర్, కొలిగడ్డతో పాటు ఆయా వీధులకు చెందిన బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాందాస్ చౌరస్తాలో కాంతరాలు, శివ విన్యాసాలు , ఫుల్ బ్యాండ్ మేళాలు, డీజే సౌండ్ తో దద్దరిల్లింది అనంతరం ఊరేగింపుగా వెళ్లి మాత నల్ల పోచమ్మ దేవాలయం వద్ద బోనాలు సమర్పించారు.

**ప్రముఖుల హాజరు..**

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని బోనం ఎత్తుకున్నారు. యువతతో కలిసి నృత్యం చేశారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మాజు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురోషోత్తమ రావు, పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య, మహాసభ అధ్యక్షుడు గంపా చంద్ర మోహన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్, జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్ కుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు పలువురిని అలరించాయి.









# టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కు కొత్త నాయకత్వం

- కంపెనీ అభివృద్ధే కార్మికుల అభివృద్ధికి బాట : ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

తూప్రాన్, జూన్ 22.ప్రజా స్వరం ప్రతినిధి:

మెదక్ జిల్లా, తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని , బ్రాహ్మణపల్లి శివారులో గల టాటా కాఫీ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీపిఎల్) కంపెనీ కార్మిక సంఘం నూతన అధ్యక్షుడిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ , మేనేజ్మెంట్ ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి ఎమ్మెల్యే, టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి కంపెనీ ఎదురుగా ముందు బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు ఎమ్మెల్యే కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ...

ఒక కుటుంబంలో భార్యాభర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగినట్లే కంపెనీ యాజమాన్యం, కార్మికులు కూడా ఐక్యంగా పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందడంతో పాటు కార్మికుల జీవితాలు కూడా మెరుగుపడతాయని ఆయన అన్నారు. కంపెనీ బాగుంటేనే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని, చిన్న చిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వెంకటరమణ రెడ్డి సూచించారు.

పరిశ్రమల అభివృద్ధి, కార్మికుల ఎదుగుదల ఒకదానికొకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయనిఆయన పేర్కొన్నారు. యాజమాన్యం, కార్మికులు పరస్పరం లాగుడుదీతలకు దిగితే సమస్యలు జటిలమై ఇరువర్గాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్మిక నాయకుడిగా, యూనియన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన మధ్యవర్తిత్వం నిర్వహించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే రెడ్డి హామీ ఇచ్చారు.

రాజకీయాల్లో అవినీతికి తాను పూర్తిగా వ్యతిరేకమని, ప్రజల డబ్బును దుర్వినియోగం చేసే వారిని సహించనని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో గత, ప్రస్తుత ముఖ్యమంత్రులపై విజయం సాధించిన ఎమ్మెల్యేగా తన బాధ్యతను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని చెప్పారు. అవసర సమయంలో అండగా నిలబడటమే నిజమైన సేవ అని, కష్టకాలంలో ఇచ్చే ధైర్యం ఎన్నో కుటుంబాలకు బలాన్నిస్తుందని పేర్కొన్నారు. కార్మికునికి న్యాయం జరిగితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తాను పదవిని ఆడంబరంగా, అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించే వ్యక్తినని తెలిపారు. టీసీపిఎల్ మేనేజ్మెంట్, కార్మికులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతున్నందున సంస్థ మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక ఉద్యోగం పై అతని కుటుంబంలోని నల్గురు సభ్యుల జీవితం ఆధారపడి ఉంటుందని, అందుకే ప్రతి ఉద్యోగి సంక్షేమం సంస్థ పురోగతి తో ముడిపడి ఉందన్నారు.

ట్రేడ్ యూనియన్ వ్యవహారాలు తనకు కొత్త అయినప్పటికీ కేవలం రెండు నెలల్లోనే యూనియన్ చట్టాలు, నిబంధనలను అధ్యయనం చేసి కార్మికులు, యాజమాన్యం మధ్య వారధిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. సంస్థలోని ప్రతి సమస్యను చర్చల ద్వారా పరిష్కరించి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీసీపిఎల్ కార్మిక సంఘానికి నూతన నాయకత్వం లభించడం సంస్థలో కార్మికయాజమాన్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, కార్మిక సంక్షేమంతో పాటు పరిశ్రమ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసీపిఎల్ సైట్ హెడ్ శివకుమార్, హెచ్.అర్ కోటేశ్వర రావు, క్వాలిటీ ఆఫీసర్ రాకేష్, ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, మెయింటెనెన్స్ ఇన్చార్జి రంగనాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం. గిరీష్ రెడ్డి, పార్లమెంట్ ఇన్చార్జి వర్గంటి రామ్మోహన్ గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య ముదిరాజ్, పడాలపల్లి కౌన్సిలర్ సత్యనారాయణ, సంఖ్య యాదగిరి, రఘువీరా రెడ్డి, వెంకట నాగేంద్ర గౌడ్, జక్కిడి నరేందర్ రెడ్డి (బుల్లెట్ రాజు), టాటా కంజుమర్ ప్రొడక్ట్ లిమిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ లంబ లవకుమార్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ బొంది శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. నర్సింగ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. రఘుపతి రెడ్డి, టి. వీరప్రసన్న, ట్రెజరర్ బి. వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి. ప్రవీణ్, జి. సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లు కే. దైవాదీనం, ఎల్. మహేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎం.రామశర్మ, కార్మిక నాయకులు, మహిళా కార్మికులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రేపటి నుంచే విత్తన మేళా

(ప్రజాస్వరం),మనోహరాబాద్:



ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు మనోహరాబాద్ మండలంలోని అన్ని రైతు వేదికలలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి స్రవంతి తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ఒకేచోట అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విత్తన మేళాలో ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. కావున మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# క్షీరసాగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

గజ్వెల్,ములుగు జూన్ 22 (ప్రజాస్వరం)

ములుగు మండలం క్షీరసాగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026 సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా KMR చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొన్యాల ఉమ నరసింహరెడ్డి, TEAM KNR సభ్యులు మరియు అంబేద్కర్ యూత్ కలిసి పాఠశాలలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన కుందనపల్లి సిరిని ప్రత్యేకంగా సన్మానించి మెమెంటోతో పాటు నగదు బహుమతి అందజేశారు.అలాగే మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన మరో ఐదుగురు విద్యార్థులకు కూడా నగదు బహుమతులు, మెమెంటోలు అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ, విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. స్థానికులు, తల్లిదండ్రులు మరియు పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించే నిర్ణయాన్ని స్వాగతించిన జేఏసీ....

మెదక్ జూన్ 22 (ప్రజా స్వరం)



కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేయడాన్ని జేఏసీ కోచైర్మన్, టీజీడిసిఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఎం. వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు నాలుగు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కూడా ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, దాదాపు పదేళ్ల పాటు ఆ హామీని అమలు చేయకుండా ఉద్యోగులను నిరాశకు గురి చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని డా. ఎం. వినోద్ కుమార్ అన్నారు. ఇకపై ఉత్తర్వులను అన్ని శాఖల్లో కచ్చితంగా అమలు చేసి, ప్రతి నెల మొదటి తేదీన ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# టార్గెట్ 2027 వరల్డ్‌కప్ ఇప్పటినుంచే బీసీసీఐ మాస్టర్ ప్లాన్!

- **2027 వన్డే వరల్డ్‌కప్‌పై బీసీసీఐ ప్రత్యేక దృష్టి**
- **మెగా టోర్నీ కోసం ఇప్పటినుంచే రోడ్‌మ్యాప్ సిద్ధం**
- **సెలెక్టర్లు, కోచింగ్ స్టాఫ్ మధ్య పూర్తి సమన్వయం**
- **ఇంగ్లాండ్ సిరీస్‌ను కీలక పరీక్షగా భావిస్తున్న బోర్డు**
- **గిల్ సారథ్యంలో కొత్త వరల్డ్‌కప్ ప్రయాణానికి శ్రీకారం**



**ప్రజాస్వరం:**

2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఓటమి గాయం ఇంకా భారత క్రికెట్ అభిమానులను వెంటాడుతూనే ఉంది. స్వదేశంలో అజేయంగా ఫైనల్ చేరిన టీమిండియా చివరి అడుగులో తడబడి ట్రోఫీని చేజార్చుకుంది. ఇప్పుడు ఆ నిరాశను తుడిచిపెట్టి 2027లో మళ్లీ ప్రపంచ కప్‌ను ముద్దాడాలనే లక్ష్యంతో భారత క్రికెట్ బోర్డు ముందడుగు వేస్తోంది. ఇందుకోసం ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది.

**స్పష్టమైన రోడ్‌మ్యాప్**

2027 వన్డే వరల్డ్‌కప్ కోసం బీసీసీఐ ఇప్పటికే ప్రణాళికలు ప్రారంభించిందని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అక్టోబర్‌నవంబర్ 2027లో జరగనున్న మెగా టోర్నీకి ముందు భారత జట్టు సరిపడా వన్డే క్రికెట్ ఆడేలా షెడ్యూల్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆటగాళ్లను పరీక్షించడంతో పాటు బలమైన జట్టును తయారు చేయడమే లక్ష్యమన్నారు.

ఇంగ్లాండ్‌తో వచ్చే నెల జరిగే మూడు వన్డేల సిరీస్ కూడా ఈ ప్రణాళికలో భాగమేనని పేర్కొన్నారు. జులై 14నుంచి 19 వరకు జరిగే ఈ సిరీస్ భవిష్యత్ కాంబినేషన్లను పరీక్షించేందుకు ఉపయోగపడనుంది. కొత్త వరల్డ్‌కప్ సైకిల్‌లో ఇది కీలక దశగా మారనుంది.

**అగార్కర్-గంభీర్ ఒకే దారిలో**

భారత జట్టు ఎంపిక కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య పూర్తి సమన్వయం ఉందని బీసీసీఐ తెలిపింది. సెలెక్టర్లు, కోచింగ్ సిబ్బంది, జట్టు యాజమాన్యం అందరూ ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నారని సైకియా వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని జట్టును నిర్మించడంపై దృష్టి పెట్టామన్నారు. కేవలం తక్షణ ఫలితాలే కాకుండా 2027 వరల్డ్‌కప్‌ను లక్ష్యంగా చేసుకుని ఆటగాళ్ల ఎంపిక, జట్టు కూర్పు, వ్యూహాలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు సంకేతాలు ఇచ్చారు.

**ఇంగ్లాండ్ సిరీస్‌కు జట్టు ఖరారు**

అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ ఇప్పటికే ఇంగ్లాండ్ పర్యటనకు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, బుమ్రా జట్టులో చోటు దక్కించుకున్నారు. యువ పేసర్ హర్షిత్ రాణా కూడా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే ఇటీవల ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో భాగమైన జైశ్వాల్, హర్ష్ దూబే, ప్రిన్స్ యాదవ్‌కు ఈసారి అవకాశం దక్కలేదు. దీంతో జట్టు కూర్పుపై చర్చ మొదలైంది.

**గిల్ యుగానికి ఆరంభం**

2023 వరల్డ్‌కప్ తర్వాత భారత వన్డే జట్టులో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కెప్టెన్‌గా రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టాడు. కొత్త నాయకత్వంలో జట్టు ఇప్పటికే ఆఫ్ఘన్‌పై 30తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పుడు ఇంగ్లాండ్ సిరీస్‌తో పాటు రానున్న నెలల్లో జరిగే వన్డే మ్యాచ్‌లు 2027 వరల్డ్‌కప్ జట్టుకు పునాది వేయనున్నాయి. యువ ఆటగాళ్లతో పాటు అనుభవజ్ఞులైన క్రికెటర్లతో బ్యాలెన్స్ సాధించడంపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టింది.

# మహిళా క్రికెటర్లకు ఐసీసీ గుడ్ న్యూస్... ప్రెగ్నెన్సీ తర్వాత ఆడేందుకు కొత్త గైడ్‌లైన్స్

- **ప్రసవం తర్వాత మహిళా క్రికెటర్లు తిరిగి ఆడేందుకు ఐసీసీ మార్గదర్శకాలు**
- **'6-R' ఫార్ములాతో దశలవారీగా పునరాగమనానికి ప్రణాళిక**
- **మాతృత్వం, కెరీర్ రెండూ కొనసాగించేలా ప్రోత్సాహం**
- **ప్రతి క్రీడాకారిణికి ప్రత్యేక కేస్ మేనేజర్, వైద్య బృందం**
- **ఆటగాళ్ల వ్యక్తిగత గోప్యత, ఆరోగ్యానికే పెద్దపీట**



**ప్రజాస్వరం:**

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సోమవారం మహిళా క్రికెటర్ల కోసం ఒక కీలకమైన ముందడుగు వేసింది. ప్రసవం తర్వాత తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వీలు కల్పించే మార్గదర్శకాలను (గైడ్‌లైన్స్) విడుదల చేసింది. మాతృత్వం కారణంగా మహిళా క్రికెటర్ల కెరీర్ ముగిసిపోకూడదనే లక్ష్యంతో, వారికి అవసరమైన మద్దతును అందించేందుకు ఈ కొత్త పాలసీని తీసుకొచ్చింది. మాతృత్వం, ప్రొఫెషనల్ క్రికెట్ రెండూ ఏకకాలంలో సాధ్యమేనని చాటిచెప్పడం ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. ఈ గైడ్‌లైన్స్‌లో భాగంగా '6R' ఫార్ములాను ఐసీసీ ప్రతిపాదించింది. ఇందులో రెడీ (సిద్ధం కావడం), రివ్యూ (సమీక్ష), రీస్టోర్ (పునరుద్ధరణ), రీకండిషన్ (పునఃస్థితికి తీసుకురావడం), రిటర్న్ (తిరిగి ఆడటం), రిఫైన్ (మెరుగుపరచడం) అనే ఆరు దశలు ఉంటాయి. శారీరకంగా కోలుకోవడం నుంచి మొదలుకొని, వైద్య సమీక్షలు, నెమ్మదిగా శిక్షణ ప్రారంభించడం, క్రికెట్‌కు అవసరమైన కండిషనింగ్ సాధించడం, పోటీల్లోకి తిరిగి రావడం, ఆ తర్వాత కూడా ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం వరకు ప్రతీ అంశాన్ని ఈ ప్రణాళికలో పొందుపరిచారు.

ఆస్ట్రేలియా జట్టు డాక్టర్, ఐసీసీ మెడికల్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలు డాక్టర్ ఫిలిప్పా ఇంగే మాట్లాడుతూ, "ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం.. బిడ్డకు జన్మనివ్వడం కెరీర్‌కు ముగింపు కాదని క్రీడాకారిణులకు భరోసా ఇవ్వడమే. చాలా దేశాల బోర్డులకు గతంలో ఇలాంటి పాలసీలు లేవు. అందుకే అన్ని దేశాలకూ అనుకూలంగా ఉండేలా, వారి అవసరాలకు తగ్గట్టు మార్చుకునేలా ఈ గైడ్‌లైన్స్‌ను రూపొందించాం. ఇది ఒక టెంప్లేట్ లాంటిది. ప్రతి క్రీడాకారిణి, వారి కుటుంబ అవసరాలకు అనుగుణంగా మద్దతు అందించాలి" అని వివరించారు.

ఈ మార్గదర్శకాల ప్రకారం, ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్‌ను నియమించాలని సిఫార్సు చేశారు. సాధారణంగా డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ ఈ బాధ్యతలు చూస్తారు. గర్భం దాల్చినప్పటి నుంచి తిరిగి మైదానంలోకి అడుగుపెట్టే వరకు వీరే ఆమెకు ప్రతినిధిగా వ్యవహరిస్తారు. అంతేకాకుండా, మెడికల్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు, సైకాలజిస్టులు, డైటీషియన్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులతో కూడిన ఒక బృందం క్రీడాకారిణికి అండగా నిలవాలని ఐసీసీ సూచించింది.

ఆటగాళ్ల వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతకు ఐసీసీ పెద్దపీట వేసింది. గర్భం దాల్చిన విషయాన్ని ఎప్పుడు ప్రకటించాలనే నిర్ణయం పూర్తిగా క్రీడాకారిణిదేనని స్పష్టం చేసింది. సభ్య దేశాల బోర్డులు తప్పనిసరిగా ప్రెగ్నెన్సీ టెస్టులు చేయించరాదని నిర్దేశించింది. గర్భధారణ సమయంలో వ్యాయామాన్ని ప్రోత్సహించినప్పటికీ, శిక్షణ, పోటీలకు సంబంధించిన నిర్ణయాలు వైద్యుల సంప్రదింపులతోనే తీసుకోవాలని పేర్కొంది. సాధారణంగా మొదటి త్రైమాసికం తర్వాత పోటీలకు దూరంగా ఉండాలని సూచించినా, ఎప్పటివరకు ఆడాలనే దానిపై కచ్చితమైన నిబంధన ఏదీ లేదని స్పష్టం చేసింది.

2021లో కుమారుడికి జన్మనిచ్చి, ప్రస్తుతం 2026 మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న వెస్టిండీస్ లెగ్ స్పిన్నర్ అఫీ ఫ్లెచర్ ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. "మహిళల కోసం ఐసీసీ ఇలాంటి పాలసీని తీసుకురావడం గొప్ప విషయం. దీనివల్ల కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే కెరీర్‌ను కొనసాగించవచ్చు. శారీరకంగా కోలుకోవడం సవాలుగా అనిపించింది. అంతకంటే ఎక్కువగా నా బిడ్డను వదిలి వెళ్లడం నన్ను చాలా బాధపెట్టింది. అందుకే మైదానంలో ప్రతీ క్షణం వాడి కోసమే ఆడతాను. ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుంది. సరైన మద్దతుతో ఆరోగ్యంగా మారి, ప్రక్రియను నమ్మాలి" అని ఆమె తన అనుభవాన్ని పంచుకున్నారు.

శిక్షణా వాతావరణంలో వెసులుబాటు, శిశువు సంరక్షణకు సలహాలు, మైదానంలో పిల్లలకు పాలివ్వడానికి లేదా చూసుకోవడానికి అనువైన గదులు, ప్రయాణ సౌకర్యాలు వంటి ఆచరణాత్మక మద్దతును కూడా ఈ మార్గదర్శకాలలో చేర్చారు. మహిళా క్రికెట్ అభివృద్ధికి తగ్గట్టుగా వారికి మెరుగైన వాతావరణం కల్పించడం చాలా అవసరమని ఐసీసీ ప్రతినిధి తెలిపారు.

# మల్కాపూర్ లో ఫ్రీ ప్రైమరి స్కూల్ లో అక్షరాభ్యాసం...


**తూప్రాన్ జూన్ 22 ప్రజా స్వరం**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రీ ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ సత్యనారాయణ తో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించేందుకు ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు వినూత్న రీతిలో రాష్ట్ర సర్కార్ విద్య బోధనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం అని సర్పంచ్ కొనియాడారు. మల్కాపూర్ కు మంజూరైన ఫ్రీప్రైమరీ స్కూలు సౌకర్యాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. పాఠశాల తరగతి గది పెయింటింగ్, చిత్రలేఖనం, ఆట వస్తువుల కై ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు మంజూరు చేసిందని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎంఈఓ తెలిపారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్రావు, యాదగిరి, ఉప సర్పంచ్ స్వామి, ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీలత, వార్డు సభ్యులు రేఖ, మేక్ ఇన్ యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆటగాళ్ల ఆరోగ్యమా? ఆట స్వరూపమా?.. ఫిఫా వరల్డ్ కప్‌లో 'హైడ్రేషన్ బ్రేక్'పై వివాదం!

- **ఫిఫా వరల్డ్ కప్‌లో తప్పనిసరి హైడ్రేషన్ బ్రేక్‌పై తీవ్ర చర్చ**
- **ఈ విరామాలు ఆట లయను దెబ్బతీస్తున్నాయని కోచ్‌లు, ఆటగాళ్ల విమర్శ**
- **ఆటగాళ్ల ఆరోగ్యం దృష్ట్యా ఇది అవసరమేనంటున్న ఫిఫా, క్రీడా శాస్త్రవేత్తలు**
- **మూడు నిమిషాలు సరిపోవని, తీవ్రమైన వేడిలో మరింత సమయం కావాలంటున్న నిపుణులు**
- **ఆట సంప్రదాయం, ఆటగాళ్ల సంక్షేమం మధ్య ఫిఫాకు ఎదురైన సందిగ్ధత**




**ప్రజాస్వరం:**

ప్రస్తుతం నార్త్ అమెరికాలో జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్‌లో తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఆటగాళ్లను కాపాడేందుకు ప్రవేశపెట్టిన ఒక నిబంధన ఇప్పుడు టోర్నమెంట్‌లోనే అతిపెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రతి మ్యాచ్‌లోనూ రెండు అర్ధభాగాల్లో మూడు నిమిషాల చొప్పున రెండు పర్యాయాలు తప్పనిసరిగా 'హైడ్రేషన్ బ్రేక్' (డ్రింక్స్ బ్రేక్) ఇవ్వాలని ఫిఫా ఆదేశాలు జారీ చేసింది. వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతి మ్యాచ్‌కు ఇది వర్తిస్తుంది. గతంలో వేడి ప్రదేశాల్లో జరిగిన టోర్నమెంట్‌ల అనుభవాల దృష్ట్యా, ఆటగాళ్లందరికీ ఒకే రకమైన రక్షణ కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఫిఫా చెబుతోంది.

అయితే, ఈ నిర్ణయంపై ఫుట్‌బాల్ ప్రపంచంలోని ప్రముఖుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విరామాలు ఆట సహజమైన గమనాన్ని, డైనమిక్స్‌ను పూర్తిగా మార్చేస్తున్నాయని వారు వాదిస్తున్నారు. ఈ నిబంధన ఫుట్‌బాల్‌లోని ప్రముఖుల నుంచి విమర్శలకు దారితీస్తోందని జిన్హువా తన కథనంలో పేర్కొంది. ఉరుగ్వే హెడ్ కోచ్ మార్సెలో బియెల్సా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వారిలో ముందున్నాడు.

"ఈ బ్రేక్స్ ఆట లయను దెబ్బతీస్తున్నాయి. రెండు భాగాలుగా జరగాల్సిన ఆటను నాలుగు భాగాలుగా విడదీస్తున్నాయి. ఇవి ఆటకు కొత్తగా ఏమీ జోడించడం లేదు, కానీ చాలా నష్టం చేస్తున్నాయి. ఈ నిర్ణయానికి ముందు ఫుట్‌బాల్‌కు ఒక ప్రత్యేకత ఉండేది, ఇప్పుడు అది మారిపోయింది. అభిమానులు దాని సహజ లక్షణాల వల్లే ఆటను ఇష్టపడతారు" అని అన్నాడు. నెదర్లాండ్స్ కెప్టెన్ వర్జిల్ వాన్ డైక్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆటగాళ్ల ఆరోగ్యం ముఖ్యమే అయినా, వాతావరణ పరిస్థితులను బట్టి బ్రేక్స్ అవసరమో కాదో నిర్ణయించాలని, అన్ని మ్యాచ్‌లకు తప్పనిసరి చేయడం సరికాదని అన్నాడు. మరోవైపు క్రీడా శాస్త్రవేత్తలు, మరికొందరు నిపుణులు ఫిఫా నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు.

వాతావరణం సాధారణంగా అనిపించినప్పటికీ, ఇది ఆటగాళ్ల ఆరోగ్యానికి అవసరమైన రక్షణ చర్య అని వారు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో మధ్యాహ్నం జరిగే మ్యాచ్‌లలో ఆటగాళ్లు చెమట ద్వారా భారీగా ద్రవాలను కోల్పోతారని, ఇది వారి ఏకాగ్రతను, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని, శారీరక ప్రదర్శనను దెబ్బతీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

కొలంబియా యూనివర్సిటీకి చెందిన జోషువా డివిన్సెంజో మాట్లాడుతూ.. "మూడు నిమిషాల హైడ్రేషన్ బ్రేక్‌ను మేము అత్యవసర పరిస్థితులను నివారించే ఒక మార్గంగా చూస్తున్నాము" అని వివరించారు. జర్మనీ హెడ్ కోచ్ జూలియన్ నాగెల్స్‌మన్ కూడా ఒక మ్యాచ్ సందర్భంగా ఈ బ్రేక్ తమ జట్టు వ్యూహాలు మార్చుకోవడానికి ఉపయోగపడిందని అంగీకరించాడు.

ఆసక్తికరంగా కొందరు పరిశోధకులు ఈ విధానాన్ని సమర్థిస్తూనే, మూడు నిమిషాల సమయం ఆటగాళ్లు తిరిగి శక్తిని పుంజుకోవడానికి, శరీరాన్ని చల్లబరుచుకోవడానికి సరిపోతుందా అని ప్రశ్నిస్తున్నారు. పరిశోధకుడు జూలియన్ పెరియార్డ్ ప్రకారం "ఈ విరామాలు కొద్దిగా సహాయపడగలవు కానీ, శరీర ఉష్ణోగ్రత పెరగడం వల్ల కలిగే అనారోగ్య ప్రమాదాన్ని పూర్తిగా తొలగించలేవు" అని పేర్కొన్నారు. తీవ్రమైన వేడి ఉన్నప్పుడు ఈ విరామ సమయాన్ని మరింత పెంచాలని, అప్పుడే ఆటగాళ్లకు పూర్తి రక్షణ లభిస్తుందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పరిణామాలతో ఫిఫాకు ఇరువైపుల నుంచి ఒత్తిడి ఎదురవుతోంది. ఒకవైపు ఆట సహజత్వాన్ని కాపాడాలని కోచ్‌లు, ఆటగాళ్లు కోరుతుంటే, మరోవైపు ఆటగాళ్ల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైతే బ్రేక్ సమయాన్ని పెంచాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతల నేపథ్యంలో భవిష్యత్తులోనూ ఫుట్‌బాల్ అధికారులు ఆట సంప్రదాయం, ఆటగాళ్ల సంక్షేమం మధ్య సమతుల్యం సాధించాల్సిన సవాల్‌ను ఎదుర్కోక తప్పదు.

# ఐపీఎల్‌లో మెగా ట్రేడ్?.. ముంబైని వీడనున్న హార్దిక్.. జైస్వాల్‌పై ఎంఐ కన్ను!

- **ముంబై ఇండియన్స్‌ను వీడనున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యా**
- **యశస్వి జైస్వాల్ కోసం రాజస్థాన్‌తో ట్రేడింగ్ ఒప్పందం**
- **కెప్టెన్సీ దక్కకపోవడంతో రాజస్థాన్‌పై జైస్వాల్ అసంతృప్తి**
- **సూర్యకుమార్ యాదవ్ కూడా జట్టును వీడే యోచనలో ఉన్నట్టు సమాచారం**
- **జట్టులో ప్రక్షాళన దిశగా ముంబై ఇండియన్స్ యాజమాన్యం అడుగులు**

**ప్రజాస్వరం:**

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కెప్టెన్‌గా విఫలమైన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టును వీడటం దాదాపు ఖాయమైంది. అతని స్థానంలో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ట్రేడింగ్ ద్వారా జట్టులోకి తీసుకురావాలని ముంబై యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు జాతీయ క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

గుజరాత్ టైటాన్స్ నుంచి భారీ అంచనాలతో ముంబైకి తిరిగివచ్చిన హార్దిక్ పాండ్యా, కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జట్టును సమర్థంగా నడిపించలేకపోయాడు. జట్టు ప్రదర్శన పేలవంగా ఉండటంతో పాటు, డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా విభేదాలు తలెత్తినట్టు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ముంబై ఇండియన్స్‌తో తన ప్రయాణాన్ని ముగించుకోవాలని హార్దిక్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. 'RevSportz' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యాను రాజస్థాన్ రాయల్స్‌కు ఇచ్చి, ప్రతిగా యశస్వి జైస్వాల్‌ను తీసుకునేందుకు ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు చివరి దశలో ఉన్నాయని సమాచారం.

మరోవైపు యశస్వి జైస్వాల్ కూడా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీతో సంతోషంగా లేనట్టు తెలుస్తోంది. సంజూ శాంసన్ నిష్క్రమణ తర్వాత జట్టులో కీలక ఆటగాడిగా, కెప్టెన్సీ రేసులో జైస్వాల్ ముందుంటాడని భావించారు. అయితే, యాజమాన్యం అతని స్థానంలో రియాన్ పరాగ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. దీనికి తోడు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రాకతో జైస్వాల్ ప్రాధాన్యం తగ్గినట్టు భావిస్తున్నారు. ముంబై రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జైస్వాల్‌కు, ముంబై ఇండియన్స్‌లోకి రావడం కెరీర్ పరంగా ఎంతో మేలు చేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

హార్దిక్ మాత్రమే కాకుండా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై ఇండియన్స్‌ను వీడే యోచనలో ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జట్టులోని సీనియర్ ఆటగాళ్లను వదులుకోవాలని యాజమాన్యం భావిస్తుండటంతో సూర్యకుమార్ కొత్త జట్టు వైపు చూస్తున్నాడు. అతనికి కెప్టెన్సీ ఆఫర్ ఇచ్చేందుకు ఉత్తరాదికి చెందిన రెండు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది.



రోహిత్ శర్మ కెరీర్ చివరి దశలో ఉండటం, హార్దిక్, సూర్యకుమార్ వంటి కీలక ఆటగాళ్లు జట్టును వీడితే ముంబై ఇండియన్స్‌కు కొత్త సూపర్ స్టార్లు అవసరమవుతారు. మూడు ఫార్మాట్లలో భారత జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతున్న యశస్వి జైస్వాల్, జట్టు భవిష్యత్ ప్రణాళికలకు సరైన ఎంపిక అని యాజమాన్యం భావిస్తోంది. అయితే, అతనికి కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పగిస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999